# సత్యాన్వేషణ

[ఆలోచనపరులు ఈ వ్యాసమును తప్పక పఠింపవలసినదిగా మా పాఠకులను కోరడము. 'మనం చాటుగా చేస్తున్న పనులు ఇతరదేశాల్లో బహిరంగంగా చెయ్యటంవల్ల మనకు ఆ దేశాలనుచూస్తే కొంత నిరసన కారణమన్నముక్క మరిచిపోకూడదు! అంత సత్యాన్ని మనం ఎదుర్కొనే స్థితికి వచ్చినతరవాత-కాలక్రమాభివృద్ధిలో-మనం వాళ్ళల్లే కావటానికి అనేక అవకాశాలు లేకపోలేదు!' అను ఇందలి వాక్యములోని అంతరార్థము ఏమిటో గ్రహింపుడు.]

సత్యాన్వేషణ ఎందుకు చెయ్యబడాలంటే ఎవరూ చెప్పలేరు. సూర్యాస్తమయం కాగానే దీపాలు వెలిగించుకోవటం ఎందుకు? భగవంతుడిచ్చిన చీకటితో తృప్తిపడి ఉండరాదూ? అజ్ఞానికూడా ఉండరాదనే తోస్తుంది మరి. తమస్సులో పుట్టాం; సత్యాన్వేషణ చేసి తీరాలి. కాలక్రమాన మనోచైతన్యంకలవాడికి "ఇది పరమార్థం" అనే నమ్మకం ఎప్పటికో అప్పటికి కలిగి తీరుతుంది. సందేహం లేదు.

సత్యమనేది భిన్నంగా ఉంటూంటుంది. గణితశాస్త్రానికి సంబంధించిన సత్యం ఒకటుంటుంది. యాభైమంది కూలీలు ఒక బండను ఒక నిమిషంలో యాభై అంగుళాలు దొర్లించగలిగితే, గణితశాస్త్రం ప్రకారం ఒకడు అదే కాలంలో అదే బండను ఒక అంగుళం దొర్లిస్తాడనటం సత్యం. ఆ ముక్క పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞుడికి చెప్తే "ఫ్రిక్షన్" అనే కొత్తవిషయం ఒకటి ఎత్తి ఒకడికా బండ మొదలు కదలనేకదలదంటాడు. తార్కికుణ్ణడిగితే మనుష్యులంతా సమానమైన బలంగలవాళ్లుగా ఉండాలి కదా లెక్క చెయ్యటానికంటాడు. మనం కూడా కొంత తర్కంఉపయోగించి ఈ ఒక మనిషి సరిగా ఆ యాభై మంది యొక్క మొత్తం బలంలో యాభయ్యోవంతు బలం గలవాడనుకోవాలి. అప్పుడు అవతలవాడు అది సరిగా నిర్ణయించటం కంటె ఒకడిచేత ఈడ్పించిచూడటం చాలా సులభమని చెప్పి గణితశాస్త్రం ఎందుకూ పనికి రానిదని నిరూపిస్తాడు.

కనక సత్యమనేది భిన్నంగా ఉంటూంటుంది,

కొంచెం ఆలోచిస్తే సత్యమనేది లేనే లేదని సిద్ధాంతం చెయ్యవచ్చును. మనకు కనపడుతున్న ప్రపంచాన్ని గురించి మనం తెలుసుకోవాలంటే పంచేంద్రియాలు తప్ప గతిలేదు. వాటిలోపాలన్నీ. కంటి అద్దం యొక్క రంగల్లే సత్యవీక్షణానికడ్డం అవుతై. భూదేవి ఒకవిధమైన గంధం—దుర్గంధమైనా సరే, సుగంధమైనా సరే—వెదజల్లుతూండవచ్చును. మనం కనుక్కోగలగటం అసంభవం. గాలికి రంగుండవచ్చును. మనకు తెలీదు. దూరాన చాకలవాడు బట్టలు ఉతుకుతూంటాడు. కన్ను చూసిన కొంతసేపటికి చెవి వింటుంది. కొత్తలో కన్ను నిర్ఘాంతపోయింది. కంటిలోపంకంటె చెవిలోపం జాస్తని తెలుసుకున్నప్పుడు కన్ను చెవిని హేళనచేస్తుంది. చలికాలంలో గచ్చుతగలగానే ప్రాణం

పోతుంది, కంబళి కప్పుకోగానే వెచ్చగా ఉంటుంది. కాని గచ్చెంత చల్లగా ఉందో కంబళీ అంత చల్లగానే ఉంది. ఐతే గచ్చు నీవేడి నాకిమ్మంటుంది; కంబళి అనదు! వెధవగచ్చు చల్లగా ఉందంటాం! అబద్ధం!

ఈ సందర్భంలో ఒకప్రశ్న? సత్యాన్వేషణపరుడికి గచ్చూ, గొంగళీ సమానంగా చల్లగా ఉన్నవనేది ఎంతవరకు ఉపయోగిస్తుంది?

ఇంకో ఉదాహరణ :—

ఒక ఎల్లమ్మ ఒక పుల్లయ్యతో పోతున్నదని ఏమీ లేందే పుకారుపుట్టింది. ఎల్లమ్మ అందరితో పోయి ''నన్ను పుల్లయ్యతో పోతున్నానంటున్నారో?'' అని మొరపెట్టుకుంది. అప్పుడెవరైనా తార్కికుడు ఎల్లమ్మతో ''నువు పుల్లయ్యతో పోయినావంటున్నారనేనా, నీ అభ్యంతరం? అసలుపోయిన మాట ఉత్తదేకదా? అవటానికొస్తే నీనోటిమీదిగా నువ్వూ అంటునే ఉంటివిగా— వాళ్ళన్నదానికి నూరిన్నిసార్లు?'' అంటాడనుకుందాం. తార్కికుడు చెప్పింది నిజమే ఔగాక! ఎల్లమ్మ ఆత్మ ఏంశాంతించింది?

ఆవిధంగానే—మశూచికం మహామారీ కాదూ మట్టిగడ్డలూ కాదు, క్రిములవల్లకలిగే జాడ్యంఅని తెలుసుకున్నంతమాత్రం చేత మశూచికంపడ్డవాడి కేం ఒరిగింది?

ఇది ఇట్లాఉండగా సత్యాన్వేషణప్రియుడు జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదం ఉంది!

థామస్ హార్డీ మహాశయుడు రాసిన ఒక నవలలో కథానాయిక తనేదో మంచిపని చేస్తున్నాననుకుని తనభర్తతో తన్ను చిన్నతనంలో మరోడు చెరిచిన సంగతి చెప్పేస్తుంది. ఆక్షణంనించీ కథ నిరాఘాటంగా విషాదాంతం కావటం మొదలుపెడుతుంది. ఎవడుకానీ భరించలేని సత్యాన్ని తెలుసుకోకూడదు. ఇటువంటిది దాంపత్యంలో ప్రతి స్వల్పవిషయంలోనూ జరుగుతూంటుంది. పెద్దవిషయాలట్లాఉంచి సంఘంలో ఒకరినిగురించి ఒకరు అనేకస్వల్పవిషయాలు తెలుసుకోకూడదు. కాఫీ అలవాటైనవాళ్లు ఒక్కొకరు కాఫీ తాగుతుంటే అటువేసి చూడకూడదు!

తెలుసుకోకూడని విషయాలున్నట్టే తెలుసుకోబడవలసిన విషయాలున్నై. అవి మతాచారాలదాస్యంనించి విముక్తిపొందటమూ వాటితాలుకు సత్యం ప్రచారం చెయ్యబడటమూ జరగాలి. మశూచికంఉంది. దాన్ని వెనకటిమాదిరిగా నమ్మకాలతో నయం చేసుకోనక్కర్లేదు. రాకుండాచేసుకోటానికీ వస్తే నయంచేసుకోటానికీ వైద్యంఉంది. ఆ విధంగానే ఈ రోజుల్లో 'ఏమోనబ్బా! నాకు పరలోకాన్నిగురించి ఎంతమాత్రమూ నమ్మకం లేదు. నేను ఉమర్ ఖయామ్ పద్ధతి మీద నడుస్తాను!' అనక్కర్లేదు. ఆవిషయమై ఇంగ్లీషులో కావలసినంత వాఙ్మయంఉంది.

ముఖ్యంగా మతం నమ్మకాలతో కూడినది. వందసంవత్సరాలక్రితం మతగ్రంథాలలో ఉండదగిన విషయాలీరోజున శాస్త్రగ్రంథాల్లో ఎక్కుతున్నై. అందుచేత మతం సంస్కరింపబడుతూండాలి. అటువంటి పని చెయ్యటం ఇష్టమో శక్తో లేక అవసరమైన సత్యప్రచారానికడ్డుపెట్టటం మూర్ఖలక్షణం.

సత్యాన్వేషణను గురించి నాకు తోచిన అంశాలివి.

(1) ఏ అమానుషదృష్టిలోనైనా సత్యం మిథ్యకావచ్చుగాక. సత్యాన్వేషణ చేసే

172

వాడికి మానుషదృష్టే ఆదర్శం. సత్యాన్వేషణకు ప్రత్యేకశాస్త్రిలవంటి పరిపూర్ణత్వం లేదు.

(౨) సత్యాన్వేషణ మానవతత్వానికి సరిపడేటట్టుండాలి. ఆ తత్వంయొక్క అభివృద్ధి సత్యాన్వేషణకు అనుకూలంగా జరగాలి కాని ప్రతికూలంగా జరిగరాదు. ఆరోజు కారోజు మనిషి ఎక్కువసత్యాన్నదుక్కుంటూండడమే రానురాను కలికాలమనిపించుకుంటూండటానికి ముఖ్యకారణం. వెనకటి చరిత్రలు కవులురాస్తే ముందుగాబోయే చరిత్రలు శాస్త్రజ్ఞులు రాస్తారు—ఆ మాట మరిచిపోగూడదు! మనం చాటుగాచేస్తున్న పనులు ఇతరదేశాల్లో బహిరంగంగా చెయ్యటంవల్ల మనకు ఆ దేశాలనుచూస్తే కొంత నిరసనకు కారణమన్నముక్క మరిచిపోగూడదు! అంత సత్యాన్ని మనం ఎదుర్కునే స్థితికి వచ్చినతరవాత—కాలక్రమాభివద్ధిలో — మనం వాళ్ళల్లే కావటానికి అనేక అవకాశాలు లేకపోలేదు!

(౩) సత్యాన్వేషణ చేయబడ్డ విషయాలనుగురించి నమ్మకాలు కలిగిఉంటాననటం పొగరుబోతుతనం.

నమ్మకాలు సహజమైనవికావు. ఆ మాటకొస్తే మనిషి ఒకకాలిమీద నిలబడటంకూడా అసహజమే. కాని నడిచిపోతున్నవాడు ప్రతిమరుక్షణమూ ఒకకాలిమీద ఉంటుంటాడు. అట్లాగే ముందుపొయ్యేవాడు సత్యాన్వేషణ చెయ్యబడని విషయాలనుగురించి నమ్మకాలు కలిగించుకోవటం తప్పలేదు. వాటిని యుగాలతరబడి నమ్మకాలకిందనే ఉండనివ్వటం చాలా అసహజం.

—కొడవటిగంటి కుటుంబరావు.



## "అదియ యేకాంతమైన"

అదియ యేకాంతమైన అన్యోన్యమధుర
భాషణమ్ముల ప్రసరించి ప్రణయరాగ,
మన్నదావేశకళ లంటి, ఐక్యపరచి
మన మనమ్ముల పాడుకొమ్మనదె మనల
నవ్యగీతాలు ;

శాశ్వతానందకాంతు
నెవరు కనరానిచోటుల కెగిరిపోయె!
కనుగొనల నుండివదలిన, మినుకుమినుకు
మనిన, ఎడద కలంచిన ఆర్ద్రవీయ
దృక్కుల స్రవించె ప్రేమసందేశలహరి!
తేల్చి తేల్చియు, పైరెప్ప వాల్చి, ఆచి
ఆచి, దృగ్గోలికల నూపినైచినావు!
వేడినిట్టూర్పు గాలికి వెచ్చగిల్లి
నీలధమ్మిల్లశిఖలలో ప్రేలబడిన
మల్లె విరిచెండులే నాట్యమాడదొడగె!
చూపువాలున తరలి నావైపుజాగు
కోమలారుణపాణి గైకొన దలంచి
చకితహృదయుడనే చేయి చాచులోన
ముడుచుకొనినావు ;

నాప్రవాలుమె డిటుత్రిప్పి,
జీరవోయిన గొంతుకు కుంచించి, 'హా' యటన్న దూరాన నా కేక కద్రరాజు
నిద్రలేచి తలెత్తి కన్విచ్చిచూచె!

—రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రి.